హలీమ్.. రుచికి గులామ్

- పట్టణ వీధుల్లో ఘుమఘుమలు
- జోరుగా విక్రయాలు
- రంజాన్ స్పెషల్ వంటకంగా ప్రసిద్ధి
- తింటే ఆరోగ్యం..తక్షణ శక్తి

రంజాన్‌లో భక్తితో చేసే ఉపవాసాలతో పాటు హలీమ్‌కు ప్రాధాన్యత ఉంది. కేవలం ఈ మాసంలోనే తయారు చేసి విక్రయించడం స్పెషల్. ఉపవాసం ముగిసిన తరువాత హలీమ్ తింటే తక్షణ శక్తి లభిస్తుంది. ముస్లింలకు ఇష్టమైనది కావడం, ప్రస్తుతం అన్ని వర్గాల వారు ఈ వంటకం రుచిని ఆస్వాదిస్తుండటంతో డిమాండ్ అధికంగా ఉంటుంది.

నంద్యాల: రంజాన్ నెల ముస్లింలకు పవిత్రమాసం. ఈ మాసమంతా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో పాటు కఠిన ఉపవాసం ఉంటారు. కనీసం నోటిలోని లాలాజం కూడా మింగకుండా దీక్ష చేస్తారు. సూర్యాస్తమం తర్వాత ఉపవాస దీక్ష విరమిస్తారు. ఈ సమయంలో అధిక శాతం మంది హలీమ్ తీసుకుంటారు. దీంతో హలీం తయారీ దుకాణాలు కళకళలాడుతున్నాయి. పట్టణ వాసులు నోరూరించే వంటకాన్ని రుచి చూసి ఆస్వాదిస్తున్నారు. ప్రస్తుతం ముస్లింలు మాత్రమే కాదు అన్ని వర్గాల ప్రజలు హలీమ్‌ను లొట్టలు వేసుకొని మరి తింటున్నారు. కారణం.. ఎన్నో పోషక విలువలతో తయారు చేయడమే. నంద్యాల పట్టణంలో 15 సంవత్సరాల క్రితం ఒకటి, రెండు చోట్ల మాత్రమే హలీమ్ కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం ఏ వీధికి వెళ్లినా హలీమ్ విక్రయ షాపులు కనిపిస్తాయి. సుమారు 40 నుంచి 70 హలీమ్ విక్రయ కేంద్రాలు ఉన్నాయంటే హలీమ్ ప్రియులు ఎంత మంది ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. నంద్యాలలోనే కాకుండా బనగానపల్లె, ఆళ్లగడ్డ, చాగలమర్రి, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్ పట్టణాల్లో విక్రయ కేంద్రాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. మటన్ హలీమ్ కప్పు రూ.280, ఆఫ్ రూ.150, చికెన్ హలీమ్ కప్పు రూ.200, ఆఫ్ రూ.100 చొప్పున అమ్ముతున్నారు.




హలీమ్‌ను తయారు చేస్తున్న దృశ్యం, గాంధీచౌక్‌లో హలీమ్ విక్రయిస్తున్న వ్యాపారులు

వండటంలోనే రుచి..

తయారీ విధానమే హలీమ్‌కు అద్భుతమైన రుచి తెచ్చిపెడుతుంది. హలీమ్ తయారీకి గోధుమ రవ్వను 4గంటలు నీటిలో నానబెడతారు. తర్వాత నీటిని ఒంపేసి మాంసం, కందిపప్పు, పెసరపప్పు, శనగ పప్పు, మసాలాలతో కలిపి 12 గంటల పాటు ఉడకబెడతారు. ఆ తర్వాత వాటిని మెత్తని పేస్ట్‌లా అయ్యే వరకు కర్రలతో కలియబెడతారు. ఇలా చేయడమే గోటకొట్టడం అంటారు. గోట కొట్టిన తర్వాతే హలీమ్ ఘుమఘుమలు మొదలవుతాయి. ఆపైన ఉల్లిపాయ ముక్కలు, బాదంపప్పు, జీడిపప్పు తదితర డ్రైఫ్రూట్స్‌ను నేతిలో వేయించి హలీమ్‌లో కలుపుతారు. తినేముందు కొత్తిమిర, పుదీన, నిమ్మరసం చల్లి ఇస్తారు. ఎట్టి పరిస్థితుల్లో చల్లారకుండా బట్టీలో వేడిమీదే ఉంచుతారు. అందుకే ఎప్పుడు హలీమ్ తిన్నా వేడిగానే ఉంటుంది.

పోషకాలెన్నో..

హలీమ్ రుచికే కాదు ఆరోగ్యానికీ మంచిది. ఇందులోని పోషకాలు శరీరానికి ఎంతో శక్తినిస్తాయి. ఒక కప్పు హలీమ్‌లో 365 కేలరీలు, కొవ్వు నుంచి లభించే క్యాలరీలు 150 లభిస్తాయి. మొత్తం కొవ్వు 17 గ్రాములు, కొలెస్ట్రాల్ 151 మిల్లీగ్రాములు, సోడియం 580 మి.ల్లీ గ్రాములు, పొటాషియం 410 మిల్లీ గ్రాములు, కార్బోహైడ్రైట్లు 29.50 గ్రాములు, షుగర్ 2.75 గ్రాములు, ప్రొటీన్లు 28 గ్రాములు లభిస్తాయి.



పద్మావతినగర్‌లో హలీమ్ తింటున్న యువకులు

ఏటా ఏర్పాటు చేస్తున్నాం



నంద్యాల పట్టణంలో ప్రతి ఏడాది హలీమ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. పదేళ్లుగా హలీమ్ తయారుచేసి అమ్ముతున్నాం. హలీమ్ తయారు చేయడానికి హైదరాబాద్ నుంచి మొదట వంట వాళ్లను తీసుకొచ్చేవాళ్లం. ప్రస్తుతం మేమే తయారు చేస్తున్నాం. నంద్యాల ప్రజలు ఎంతో ఇష్టంగా తింటున్నారు. హలీమ్‌ను రుచి చూడటానికి ఇతర ప్రాంతాల నుంచి కూడా నంద్యాలకు వస్తున్నారు.

– హుసేని, వ్యాపారి, పద్మావతినగర్, నంద్యాల

క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు సురక్షితం



తల్లీబిడ్డను పరీక్షిస్తున్న వైద్యులు

దొర్నిపాడు: ప్రభుత్వ వైద్యశాలలో సురక్షిత ప్రసవాలు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నాగేంద్ర తెలిపారు. శనివారం మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన హుసేనమ్మ అనే మహిళ రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చిందన్నారు. వెంటనే బిడ్డకు బీసీజీ, హెపటైటిస్ బి, ఓరల్ పోలియో టీకాలు వేశామని, తల్లీ,బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. డాక్టర్ రుహుల్లాఖాన్ పాల్గొన్నారు.

సేవల్లో నిర్లక్ష్యం తగదు



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

గోస్పాడు: శిశువుల వైద్య సేవలపై నిర్లక్ష్యం తగదని జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్త కార్యక్రమం జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కాంతరావు నాయక్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని హెచ్‌ఎస్ కొట్టాల, జూలేపల్లె గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌కు వచ్చిన గర్భిణులు, బాలింతలకు వ్యాక్సినేషన్ల పనితీరు, నివారించే ప్రమాదకర అంటువ్యాధుల గురించి వివరించారు. వ్యాక్సినేషన్ వల్ల వచ్చే ఇబ్బందులను ముందస్తుగా వారికి తెలియజేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం 5, 10, 16 సంవత్సరాల వయస్సు వారీగా ఇచ్చిన అన్ని రకాల వ్యాక్సిన్లను నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా విషు వేడుకలు



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం మళయాళీల నూతన సంవత్సరం విషు సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, గంధాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలరించారు. అనంతరం స్వామి వారికి పచ్చిబియ్యం, కొత్త బట్టలు, బంగారు, పసుపు, దోసకాయలు, అరటి పండ్లు, తమలపాకులు, అద్దంను స్వామి వారికి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.


భూసార పరీక్షలపై అవగాహన

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు గ్రామంలో శనివారం రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో భూసార పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాల పరీక్షలపై వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ రైతులకు అవగాహన కల్పించారు. సేకరించిన మట్టి నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించి ఫలితాల ద్వారా వాడవలసిన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల మోతాదును తెలియజేస్తామని చెప్పారు. ఏఈఓలు వెంకటేశ్వర్‌రెడ్డి, రాణి, విఏఏ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ నారాయణరావు అన్నారు. మండలంలోని దీంబగుంట్లలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం జాతీయ సేవా పథకం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం వద్ద పలు జబ్బులతో బాధ పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ప్రొఫెసర్లు స్వరాజ్యలక్ష్మి, సవిత, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి మంత్రి హామీ



మంత్రి బుగ్గనకు సమస్యను వివరిస్తున్న సరళమ్మ, సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: పాణ్యం–గోరుకల్లు రోడ్డు నిర్మాణానికి మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఓ ప్రైవేట్ కార్యక్రమం నిమిత్తం శనివారం కొణిదేడు గ్రామానికి వచ్చిన మంత్రిని పాణ్యం జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి కలిశారు. పాణ్యం–గోరుకల్లు గ్రామాల మధ్య 13 కిలోమీటర్ల దూరం ఉందని, భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపితే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామికి ఉదయాన్నే భక్తులు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అంబలి పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమం ఆధ్వర్యంలో పట్టణంలోని చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి శనివారం మజ్జిగ, అంబలి పంపిణీ చేశారు. నిర్వాహకులు డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో కూరగాయల మార్కెట్, గాంధీచౌక్, నాగులకుంట రోడ్డు, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు, పాదాచారులకు మజ్జిగ, అంబలిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రి డీఎంఅండ్‌హెచ్ఓ అక్రమ వసూళ్లపై విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, హాస్పిటళ్ల దోపిడీని పట్టుఇంచుకోకుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి అవినీతికి పాల్పడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లోక్ అదాలత్‌లో కేసులకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): లోక్‌అదాలత్‌లో కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మూడవ అదనపు జిల్లా జడ్జి, లోక్‌అదాలత్ చైర్మన్ పి.వాసు పేర్కొన్నారు. శనివారం మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మే 13న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. కక్షిదారులతో పోలీసులు సమాశం నిర్వహించి లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరించాలని చెప్పారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, మున్సిపల్, బ్యాంక్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించే కేసులకు అప్పీల్ ఉండదని, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కక్షి దారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, నరసింహులు, సుబ్బరామిరెడ్డి, మహానంది, పాణ్యం, గడివేముల స్టేషన్ల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి నియామకం

ఉయ్యాలవాడ : స్థానిక గ్రామ సచివాలయానికి పంచాయతీ కార్యదర్శిగా జయరామిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రుద్రవరం మండలం సర్వాపురం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఈయనను డిప్యుటేషన్‌పై కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పంచాయతీ విస్తరణాధికారి ఉయ్యాలవాడకు నియమించినట్లు మండల పరిషత్ ఏఓ సత్యన్న తెలిపారు. గతంలో ఇక్కడ అల్లూరు కార్యదర్శి అబ్దుల్ రహీం ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. జయరామిరెడ్డి రాకతో ఖాళీగానున్న కార్యదర్శి పోస్టు భర్తీ అయ్యింది.

గృహ నిర్మాణాలు చేపట్టండి

రుద్రవరం: గృహ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డేలో భాగంగా శనివారం మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె గ్రామంలో పర్యటించారు. అక్కడ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. బిల్లులు చెల్లింపుల్లో జాప్యం లేదని స్టేజీల వారీగా వస్తున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ పనులు ప్రారంభించి సొంతింటి కల నెరవేర్చుకోవాలని చెప్పారు. సచివాలయ సిబ్బంది,హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ ఉన్నారు.

నేడు జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష

నంద్యాల(వ్యవసాయం): జూనియర్ సివిల్ జడ్జి పోస్టులకు ప్రిపేర్ అయ్యే న్యాయవాదులకు కోర్టు ప్రాంగణంలో ఆదివారం మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, రఘుప్రకాష్, ప్రతాపరెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ జడ్జి పరీక్షల్లో అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా, పరీక్షపై అవగాహన కల్పించడం కోసం మోడల్ పరీక్ష ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఉదయం 10గంటలకు పరీక్ష నిర్వహించి ఫలితాలను మరుసటి రోజు వెలువరిస్తామని, న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న తహసీల్దార్ జయప్రసాద్

దొర్నిపాడు: నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో ఉత్తమ ప్రతిభ చూపిన తహసీల్దార్ జయప్రసాద్ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని శామూన్ నుంచి నంద్యాలలో శనివారం ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రభుత్వ పనుల్లో జిల్లాలోనే ఎంతో పురోగతి సాధించడం పట్ల కలెక్టర్ అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి, జగనన్న ఇళ్లకు స్థలాలు కేటాయించడంతో పాటు వారికి సకాలంలో పట్టాలు అందజేయడం, మ్యూటేషన్‌లు తిరస్కరణకు గురిచేయకుండా వెంటనే పరిష్కరించడం వంటి వాటిని సకాలంలో పూర్తి చేశారు. అలాగే ఓటర్‌కు ఆధార్ సీడింగ్ జిల్లాలోనే మండలాన్ని ముందంజలో ఉంచారు. నంద్యాల–జమ్మలమడుగు జాతీయ రహదారి(ఎన్‌హెచ్167–కె) పనులకు సంబంధించి గుండుపాపలలో భూ సేకరణ పనులు, జగన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం సకాలంలో పూర్తి చేయడం, విద్యార్థులకు ధ్రువపత్రాలు, నూతన రేషన్‌కార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయించారు. డీటీ రవి, వీఆర్ఓలు సాంబశివుడు, సావిత్రి నాగేష్, మురళీ తహసీల్దార్‌కు అభినందనలు తెలిపారు.

మళ్లీ ఇంటర్‌లో కలుద్దాం

- ముగిసిన 'పది' పరీక్షలు



ఉయ్యాలవాడలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



రుద్రవరం పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ: ఈ నెల 3న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్ రెండు పరీక్ష కేంద్రాల్లో 356 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సంబంధిత అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్ద సంతోషంతో కేరింతలు కొట్టారు. మళ్లీ ఇంటర్‌లో కలుసుకుందామంటూ బై బై చెప్పుకుంటూ వెళ్లిపోయారు.

దొర్నిపాడు: పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 122 మంది రెగ్యులర్, ఆరుగురు కంపార్ట్‌మెంటల్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు సజావుగా జరిగినందుకు సహకరించిన తల్లిదండ్రులు, విద్యార్థులు, పోలీసులకు పరీక్షల చీఫ్ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

రుద్రవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. వివిధ గ్రామాల పాఠశాలల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో పరీక్షలు రాశారు. పరీక్షలు ముగియడంతో కేంద్రాల నుంచి విద్యార్థులు సంబరంగా బయటకు వచ్చారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించు కుంటూ పరీక్షలు రాసిన విధానం పై చర్చించుకొని వీడ్కోలు చెప్పుకొని వెళ్లిపోయారు.

ఆధారాలతో వస్తే చిన్నారిని అప్పగిస్తాం



కర్నూలు శిశు గృహంలో ఉన్న చిన్నారి

నంద్యాల(అర్బన్): ఇటీవల నంద్యాల జిల్లా బేతంచెర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన చిన్నారి (శ్రీలేఖ)కి సంబంధించిన ఆధారాలతో వస్తే అప్పగిస్తామని జిల్లా బాలల సంరక్షణాధికారిణి శారద తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు చిన్నారిని మూటకట్టి వదిలి వెళ్లడాన్ని గమనించిన ఆసుపత్రి సిబ్బంది 1098కి ఫిర్యాదు చేశారన్నారు. ప్రస్తుతం చిన్నారి కర్నూలు సీక్యాంపు శిశు గృహంలో ఉందన్నారు. ఆధారాలతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, స్త్రీశిశు సంక్షేమ అధికారులను కలిసి బాలికను తీసుకెళ్లవచ్చని చెప్పారు. ఎవరూ రాకపోతే 30రోజుల తర్వాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తీర్మానం మేరకు అనాథగా నిర్ణయించి చట్టప్రకారం దత్తత ఇస్తామని స్పష్టం చేశారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు తెలుసుకుంటూ వాటిని సత్వరమే పరిష్కరించల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజా సమస్యలను గమనించిన జగనన్న వాటి పరిష్కారానికి అధికారంలోకి వచ్చిన రోజు నుంచే పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు పరిపాలన అంతా అవినీతితో కూడినదన్నారు. యువతీ, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ నెపంతో రూ.371 కోట్లు మింగేశారని ఆరోపించారు. ఎంపీపీ వీరభద్రుడు, కుమార్ రెడ్డి, దస్తగిరి, బేబమ్మ, లక్ష్మిరెడ్డి, జమాల్, ఓబులేసు, సాల్మన్, రమణారెడ్డి ఉన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

నంద్యాల(సిటీ): 2023–24 విద్యా సంవత్సరానికి పాలిసెట్ ప్రవేశానికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఈఎస్ఈ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాలలోని ఈఎస్ఈ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17వ తేదీ నుంచి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నిష్ణాతులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌కు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు http://poycetap.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, వివరాలకు సెల్ 9959931461, 709703054 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ పరీక్షలకు 220 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): పదవతరగతి, ఇంటర్ ఓపెన్ పబ్లిక్ పరీక్షలకు 220 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శనివారం జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు 849 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 766 మంది హాజరు కాగా 83 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా 8 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ ఓపెన్ పరీక్షలు 1,401 మంది రాయాల్సి ఉండగా 1,264 మంది హాజరు కాగా 137 మంది గైర్హాజరయ్యారు.

జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): దేశంలోని నిరుద్యోగులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ఈనెల 24న విజయవాడలో జరిగే జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, నంద్యాల బీసీ సెల్ అధ్యక్షుడు రామకృష్ణ, ఆనందరావు, జిల్లా ట్రెజరర్ ఎస్‌వైడీ ప్రసాద్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

రంజాన్ కిట్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): డీఎస్ హాజీ మహమ్మద్ హనీఫ్ అండ్ సన్స్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సంక్షేమ శాఖ సలహాదారు హబీబుల్లా, డీఎస్ఎం బ్రదర్స్ మహమ్మద్, ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, మోహిద్దీన్, షేక్షా, సద్దాం హుసేన్, మాజీ కౌన్సిలర్ జాకీర్‌హుసేన్ తదితరులు దాదాపు 700 మంది పేద ముస్లింలకు కిట్ల అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ దుర్మరణం



మృతిచెందిన ఖలీల్ (ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల – ఆళ్లగడ్డ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బైక్ మెకానిక్ దుర్మరణం చెందాడు. తాలుకా ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఖలీల్ (30) బైక్ మెకానిక్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఖలీల్ సొంత పని నిమిత్తం శనివారం నంద్యాల పట్టణానికి వచ్చి బైక్‌పై ఆళ్లగడ్డకు తిరుగు ప్రయాణమయ్యాడు. అయ్యలూరు మెట్ట సమీపంలో వేగంగా వచ్చిన కారు ఖలీల్ బైక్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించి, ప్రమాదానికి కారణమైన కారును, అందులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఖలీల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

గో సంరక్షణశాలలో శుభ్రతకు ప్రాధాన్యతివ్వాలి



గోశాలలో పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: గో సంరక్షణ శాలలో శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈఓ ఎస్ లవన్న ఆదేశించారు. శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ శాలను శనివారం సందర్శించారు. గో సంరక్షణ శాల కోసం కొనగోలు చేయబడుతున్న గ్రాసం, రోజువారీ గ్రాసం వినియోగం, గోసంరక్షణకు సంబంధించిన ఔషధాల స్టాక్ , విభూతి తయారీ మొదలైన వాటిని పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ గో సంరక్షణ శాలలో గడ్డిని కత్తిరించే యంత్రాలను నిరంతరం వినియోగించుకునేందుకు వీలుగా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తుండాలన్నారు. అవసరమైతే మరో రెండు యంత్రాలను కూడా కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గోవులకు అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండ టీకాలు వేయించాలని సూచించారు. ఈఈ రామకృష్ణ, గోశాల ఇన్‌చార్జ్ టి.శ్రీనివాసరావు, ఉద్యాన విభాగపు విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, గోశాల గుమస్తాలు హర్యానాయక్, హనుమంత్ పాల్గొన్నారు.

పరీక్షలు జరిగిన ఆరు నెలలకు ఫలితాలు

- గతేడాది సెప్టెంబరు/అక్టోబరులో ఫోర్త్ సెమిస్టర్ పరీక్షలు
- మూల్యాంకనం మూడు యూనివర్శిటీల్లో చేశామంటున్న ఆర్‌యూ అధికారులు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్శిటీ పరీక్షల విభాగం పని తీరుపై అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఏ యూనివర్శిటీలోనైనా పరీక్షలు నిర్వహిస్తే నెల, రెండు నెలల్లో ఫలితాలు ప్రకటిస్తారు. కానీ ఆర్‌యూలో పీజీ ఫోర్త్ సెమిస్టర్ గతేడాది సెప్టెంబరు/అక్టోబరు నెలలో పరీక్షలు నిర్వహించారు. వాటి ఫలితాలు మాత్రం సుమారు ఆరు నెలల తరువాత శనివారం విడుదల చేయడం అనేక విమర్శలకు తావిస్తుంది. కాగా ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులు 813 మంది హాజరుకాగా, 717 మంది ఉత్తీర్ణులు అయ్యారు. సప్లమెంటరీ పరీక్షలు 247 మంది రాయగా, 126 మంది పాసయ్యా రు. ఈ పరీక్షలే కాదు..ఎల్ఎల్‌బీ, బీఈడీ, బీపీఈడీ తదితర పరీక్షలు సైతం గతేడాది డిసెంబరులో నిర్వహించగా నాలుగు నెలల తరువాత ఫలితాలు ప్రకటించారు. ఈ విషయంపై ఆర్‌యూ పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లును అడగగా పీజీ పరీక్షలు గతేడాది సెప్టెంబరు/అక్టోబరులో నిర్వహించామని, మూల్యాంకనం మరో యూనివర్శిటీలో జరగడం, తరువాత మళ్లీ మరో రెండు యూనివర్శిటీల్లో వెరిఫై చేయడంతోనే ఫలితాలు ఆలస్యం అయ్యాయని చెప్పారు. మూడు యూనివర్శిటీల్లో మూల్యాంకనం జరుగుతుందని, డిగ్రీ పరీక్షలు అయితే ఒకే చోట జరుగుతాయి కాబట్టి ఫలితాలు త్వరగా వస్తాయని సమాధానం ఇచ్చారు.